# సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేష్‌కు జోహార్లు

**సామాజిక** కార్యకర్త, పండితుడు, ఆర్యసమాజ్ నాయకుడు స్వామి అగ్నివేష్ 2020 సెప్టెంబర్ 11న ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో మరణించారు. ఆయన వయసు 80 సంIIలు.

స్వామి అగ్నివేష్ అట్టడుగు, పీడిత ప్రజలకోసం ఇతర శ్రామిక ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 1970 సంIIలో ఆయన ఆర్యసమాజ సూత్రాలపై ఆధారపడి ఆర్యసభను స్థాపించి, ఆ సంస్థ అంతర్జాతీయ నాయకునిగా కొనసాగారు. 1977లో హర్యానా శాసనసభ సభ్యునిగా ఎన్నికైన స్వామి అగ్నివేష్, ఆ రాష్ట్ర విద్యాశాఖామంత్రిగా పనిచేశారు. వెట్టిచాకిరి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులపై పోలీసు కాల్పులను నిరసిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేశారు. వెట్టిచాకిరి విముక్తి ఫ్రంట్‌ను ఆయన 1981లో స్థాపించారు. పౌర ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఉద్యమాల్లోను, దళితులపై సామాజిక అణచివేతకు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా, ప్రజలపై రాజ్య హింసకు వ్యతిరేకంగా సాగిన అనేక ఉద్యమాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. అవినీతి వ్యతిరేక ఆందోళనల్లో, అవినీతికి కల్పించే చట్టబద్ధ రక్షణలకు వ్యతిరేకంగా ఆందోళనల్లో ఆయన చురుకైన పాత్ర నిర్వహించారు. శ్రామిక ప్రజానీకపు, అట్టడుగు ప్రజానీకపు హక్కులను సాధించుకోవడం లేదా పరిరక్షించుకోవడానికి ఆయన ప్రజాస్వామ్య, శాంతియుత నిరసన పద్ధతులనే మార్గంగా ఉపయోగించారు. మతతత్వ ఛాందసవాదాన్ని వ్యతిరేకించి మత సామరస్యం కోసం ఆయన నిలిచారు. తమ భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా నిరసన తెల్పుతున్న ఆదివాసులకు మద్దతుగా నిల్చినందుకుగాను ఝార్ఖండ్‌లో బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల గూండాల గుంపు ఆయనపై పలుమార్లు క్రూరంగా దాడిచేసి గాయపర్చారు. ఆయన మరణంతో, శ్రామికవర్గం, పీడిత ప్రజానీకం తమ నిజమైన స్నేహితుడిని, సహచరుని కోల్పోయారు. ఆయనకు మేము జోహార్లు అర్పిస్తున్నాం.

**ఎస్.ఝాన్సి**

**15-9-2020** **సిపిఐ(ఎం-ఎల్)**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటి**

★ ★ ★